సాక్షి
కామారెడ్డి
ఆదివారం ౹ 10 ౹ సెప్టెంబర్ ౹ 2023



సదరం తిప్పలు

సదరం స్లాట్ బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురయ్యాయి. చాలామంది దివ్యాంగులు నిరాశతో వెనుదిరిగారు.

- 10లో ▸



సొసైటీలు ఏర్పాటు చేస్తాం

ప్రతి గ్రామంలో మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేసేలా చూస్తామని మత్స్య ఫెడరేషన్ చైర్మన్ రవీందర్ పేర్కొన్నారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /22.1

వాతావరణం

వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వాన కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌లోకి 9వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం 9 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ఒక వరద గేటు ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 1,404.75 అడుగుల(17.441 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

13న ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో ఈనెల 13న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్చరీ పోటీలను నిర్వహించనున్నట్లు కోచ్ ప్రతాప్ దాస్ తెలిపారు. అండర్ -14, 17, 19 విభాగాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 13వ తేదీ ఉదయం 8 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 97051 41241 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టెట్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

కామారెడ్డి టౌన్: టెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో ఎస్.రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. tstet.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌పై ఫొటో, సంతకం లేకపోతే ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి, తప్పనిసరిగా డీఈవో ద్వారా ధ్రువీకరించుకోవాలని తెలిపారు.

'దేశ రక్షణలో సైనికుల పాత్ర వెల కట్టలేనిది'



కామారెడ్డి రూరల్: దేశ రక్షణలో సైనికుల పాత్ర వెల కట్టలేనిదని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నమల్లారెడ్డిలో మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సైనికుడు అంతగోని రాజాగౌడ్, నేవీ ఉద్యోగులు బాణాల ఆంజనేయులు, శివ ప్రసన్న ఇళ్లనుంచి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలంతా ఒక్కటే అనే నినాదంతో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తితో దేశంలోని ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నామన్నారు. ఈ మట్టిని ఢిల్లీకి తరలిస్తామని, అక్కడ అమృత్ వన్ నిర్మిస్తారని పేర్కొన్నారు.

'మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠిస్తాం'



కామారెడ్డి రూరల్: గ్రామంలో మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని నిర్ణయించామని గర్గుల్ సర్పంచ్ రవితేజ గౌడ్ తెలిపారు. శనివారం గ్రామస్తులు సమావేశమయ్యారు. మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని తీర్మానించామని సర్పంచ్ తెలిపారు. ఐదేళ్లుగా మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠిస్తున్నామని పేర్కొన్నారు.

ఐఐటీల్లో మనోళ్లు



▪ కందుకూరి విశ్వేష్
కామారెడ్డివాసి,
సీఎస్ఈ ఫైనల్ ఇయర్,
ఐఐటీ బాంబే



▪ ఎం.రుత్విక్
గాంధారివాసి
సీఎస్ఈ కంప్లీటెడ్, ఐఐటీ ధన్‌బాద్



▪ వి.శిల్ప
గుజ్జుల్ తండావాసి,
ప్రొడక్షన్, ఇండస్ట్రియల్ ఫస్టియర్, ఐఐటీ రూర్కీ



▪ గజ్జె శ్రీవాణి
భిక్కనూరువాసి
సీఎస్ఈ సెకండ్ ఇయర్,
ఐఐటీ పాట్నా



▪ క్రాంతిచంద్రారెడ్డి
ఆరెపల్లివాసి,
సీఎస్ఈ కంప్లీటెడ్,
ఐఐటీ బాంబే



▪ పి.మాధురి
కామారెడ్డివాసి,
మెకానికల్ థర్డ్ ఇయర్,
ఐఐటీ బాంబే



▪ ఏనుగు నమ్రతారెడ్డి
ఆరెపల్లివాసి,
ఎలక్ట్రికల్ ఫైనల్ ఇయర్,
ఐఐటీ మద్రాస్



▪ డి.సింజని
కామారెడ్డివాసి,
సివిల్ థర్డ్ ఇయర్,
ఐఐటీ గౌహతి



▪ సోమన్నగారి ఆనందిత
కామారెడ్డివాసి,
ఏరోస్పేస్ ఫస్టియర్,
ఐఐటీ బాంబే



▪ తృప్తి శ్రీహర్షిత్
కామారెడ్డి వాసి
సీఎస్ఈ ఫస్ట్ ఇయర్,
ఐఐటీ పాట్నా



▪ బానోత్ వినయ్‌చరణ్
ఎల్లారెడ్డివాసి,
సీఎస్ఈ కంప్లీట్,
ఐఐటీ గౌహతి



▪ మర్రి సింధు
ఎల్లారెడ్డివాసి,
సీఎస్ఈ కంప్లీట్,
ఐఐటీ గౌహతి

- అత్యున్నత విద్యాసంస్థల్లో జిల్లా విద్యార్థులు
- ఏటా పదిమందికిపైనే ఎంపిక



దేశంలోని సాంకేతిక విద్యాసంస్థల్లో ఐఐటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లు మేటి.. ఇందులో సీటొస్తే జీవితంలో సెటిలైనట్లే.. ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి బాటలు పడినట్లే.. అత్యున్నత శిక్షణ అందించే ఐఐటీలలో చదివిన విద్యార్థులంటే మల్టీ నేషనల్ కంపెనీలకూ మక్కువ ఎక్కువే. దిగ్గజ కంపెనీలెన్నో ఐఐటీ విద్యార్థుల భావి జీవితానికి రాచబాట పరవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. అలాంటి అత్యున్నత విద్యాసంస్థల్లో మన విద్యార్థులకూ చోటు లభిస్తోంది. జిల్లావాసులు చక్కగా చదివి ప్రతిష్టాత్మకమైన ఐఐటీలలో సీటు సంపాదించి, భావి జీవితానికి బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఐఐటీలలో మన విద్యార్థులపై సండే స్పెషల్..

సండే స్పెషల్



▪ ఎన్.కల్యాణ్
సంగెంవాసి, సీఎస్ఈ ఫస్టియర్, ఐఐటీ హైదరాబాద్



▪ గరిడె అవినాశ్
మాధవపల్లివాసి,
ఎలక్ట్రికల్ ఫస్టియర్, ఐఐటీ పాలక్కాడ్

సాక్షి, కామారెడ్డి: ఐఐటీల్లో సీటు వచ్చిందంటే మంచి కంపెనీలో ఉద్యోగం, మంచి ప్యాకేజీతో బయటకు వచ్చే అవకాశం ఉంటుంది. దాదాపు ప్రతి విద్యార్థి ఏదో ఒక ఉద్యోగంతోనే బయటకు వస్తుంటారు. ఇంజినీరింగ్ అంటే మొదట ఐఐటీ కాలేజీల మీదనే దృష్టిపెట్టి ప్రిపేర్ అవుతారు. ఐఐటీలలో సీట్లు రాని పక్షంలో ఇతర ఇంజినీరింగ్ కాలేజీల వైపు మళ్లుతారు. ప్రైవేటు, కార్పొరేటు రంగంలో స్కూల్ ఎడ్యుకేషన్ నుంచే ఐఐటీ ఫౌండేషన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇంటర్‌లో అయితే ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ జేఈఈకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నాయి. ఇంటర్‌తోనే జేఈఈ మీద దృష్టి పెట్టి చదువుతున్నారు.

ఐఐటీ సీటు సాధించడం అంటేనే లైఫ్ సెటిల్ అయినట్టు గా భావిస్తుంటారు. ఉన్నతమైన ఉద్యోగం, మంచి జీతం లభిస్తుందన్న నమ్మకంతో ఐఐటీల్లో సీటు సాధించేందుకు శ్రమిస్తుంటారు. దేశంలోని ఐఐటీల్లో దాదాపు అన్నిచోట్ల ఉత్తమ బోధన లభిస్తోంది. ప్లేస్‌మెంట్స్‌కీ ఢోకా ఉండదు. మన దేశంలోని ఐఐటీలలో విద్య పూర్తిచేసినవారికి అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా తదితర దేశాలతో పాటు గల్ఫ్ దేశాల్లో మంచి కంపెనీలలో అనేక అవకాశాలు లభిస్తున్నాయి. అలాగే ఐఐటీల్లో చదువు పూర్తయిన వారిలో చాలా మంది సివిల్స్ వైపు కూడా వెళ్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికైన వారిలో చాలామంది ఐఐటీ చదివిన వారే ఉంటున్నారు.

ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ..

సాంకేతిక విద్యాసంస్థల్లో అత్యున్నతమైన ఐఐటీలలో మన జిల్లా బిడ్డలు సత్తా చాటుతున్నారు. ఐదారేళ్లుగా జిల్లా నుంచి ఏటా పదుల సంఖ్యలో ఐఐటీ లలో సీట్లు సాధిస్తున్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించి జిల్లా నుంచి పదుల సంఖ్యలో సీట్లు సాధిస్తున్నారు. దేశంలో 23 రాష్ట్రాల్లో ఐఐటీలున్నాయి. బాంబే, ఢిల్లీ, గౌహతి, రూర్కీ, రోపర్, హైదరాబాద్, గోవా, ధార్వాడ్, భువనేశ్వర్, గాంధీనగర్, జోధ్‌పూర్, పాట్నా, మాండి, వారణాసి, తిరుపతి, ధన్‌బాద్, భిలాయ్, కరగ్‌పూర్, మద్రాస్, కాన్పూర్, ఇండోర్, పాలక్కాడ్ ఐఐటీలన్నింటిలోనూ జిల్లా విద్యార్థులు సీట్లు సాధించారు. ఆయా కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్, ఎరోనాటికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆటోమొబైల్, ఏరోస్పేస్, మెకానికల్, పెట్రోలియం, ఇండస్ట్రియల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, మెరైన్ ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో సీట్లు సాధించారు. కొందరు విద్యాభ్యాసం పూర్తి చేసి మంచి ఉద్యోగాలు పొందారు.

కోర్టు కేసులలో రాజీయే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్.శ్రీదేవి
- జాతీయ లోక్ అదాలత్‌లో 4,884 కేసుల పరిష్కారం



జిల్లా కేంద్రంలోని కోర్టులో కేసులకు పరిష్కారం చూపుతున్న న్యాయమూర్తి శ్రీదేవి

కామారెడ్డి టౌన్: కోర్టు కేసులకు సంబంధించి కక్షిదారులకు రాజీయే రాజమార్గమని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎస్.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమాలకు అనూహ్య స్పందన లభించిందన్నారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసులు, కోర్టు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. నష్ట పరిహారం కింద వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి బాధితులకు చెక్కులను ఇప్పించారు.

కోర్టులవారీగా..

జిల్లాలో లోక్ అదాలత్‌లో 4,884 కేసులకు పరిష్కారం చూపారు. జిల్లా కోర్టులో 13, అడిషనల్ జిల్లా కోర్టులో 6, జూనియర్ సివిల్ కోర్టులో 88, మొబైల్ కోర్టులో 86, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 1,589, ఎల్లారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 1,025, బాన్సువాడ జూనియర్ కోర్టులో 521, బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టులో 1,546, డీఎల్ఎస్ఏలో 10 కేసులను పరిష్కరించారు. కార్యక్రమాలలో అదనపు జిల్లా న్యాయమూర్తులు లాల్‌సింగ్, శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తులు బి.శ్రీదేవి, భార్గవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కళాభారతిలో శనివారం పీఆర్‌టీయూ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని సత్వరమే రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలలో సమస్యలను పరిష్కరించాలని, ఈనెలాఖరులోపు అన్ని బకాయిలను చెల్లించాలని కోరారు. పదోన్నతులను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చెన్న కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాపూర్ కుశాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చేద్దాం!

- 15న ఘనంగా వైద్య కళాశాల ప్రారంభించాలని సర్కారు నిర్ణయం
- 15 వేల మందితో ర్యాలీకి అధికార పార్టీ సన్నాహాలు
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న ప్రజాప్రతినిధులు



ముస్తాబవుతున్న కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల భవనం

సాక్షి, కామారెడ్డి: జిల్లాకేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవాన్ని ఈనెల 15న వేడుకగా నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించాలని అధికార పార్టీ యోచిస్తోంది. 2018లో కామారెడ్డిలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న సీఎం కేసీఆర్.. మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కళాశాలను మంజూరు చేశారు. ఈనెల 15న వర్చువల్‌గా కళాశాలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించి, చేసిన గొప్పను వివరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నాయకులను ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవాన్ని వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్చువల్‌గా సీఎం కేసీఆర్ ఏకకాలంలో రాష్ట్రంలోని తొమ్మిది మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తారు. కామారెడ్డిలో నిర్వహించే కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు పాల్గొననున్నారు. మెడికల్ కాలేజీ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలో వైద్య విద్య అందుబాటులోకి రావడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. కనీసం 15 వేల మందిని సమీకరించాలని యోచిస్తున్నారు. విద్యార్థులతో పాటు వివిధ వర్గాల వారిని ఎక్కువ సంఖ్యలో సమీకరించి జిల్లా కేంద్రంలో ర్యాలీ తీయాలని, అనంతరం సమావేశం నిర్వహించాలని నాయకులు భావిస్తున్నారు.

పనులను వెంటనే పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: వైద్య కళాశాలను ఈనెల 15న ప్రారంభించనున్న నేపథ్యంలో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో నిర్మిస్తున్న వైద్యకళాశాల పనులను శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో పురోగతిలో ఉన్న పనులను, వసతి గృహ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అనాటమీ, లెక్చరర్ గ్యాలరీ, ల్యాబ్‌లు తదితర విభాగాలతో పాటు విద్యార్థులకు వసతి గృహాలు, కామన్ ఏరియా పనులు పూర్తి కావస్తున్నాయని పేర్కొన్నారు. మిగిలిన చిన్నచిన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు కళాశాల ప్రారంభానికి చేపట్టాల్సిన పనులపై కాంటాక్టర్లకు పలు సూచనలు ఇచ్చారు. ప్రధానాచార్యులు వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అడ్మిషన్లు పారదర్శకంగా జరిగాయన్నారు. విద్యార్థులకు చక్కటి వాతావరణం, వసతి గృహాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. తరగతులను సక్రమంగా నిర్వహించడానికి, ల్యాబ్‌లో అన్ని పరికరాల ఏర్పాటుతో పాటు ఫ్యాకల్టీ, పరిపాలనా సిబ్బందిని నియమించామన్నారు. కామారెడ్డి వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

- ఆరు జిల్లాల పోలీసు అధికారులు, మహారాష్ట్ర పోలీసుల ఉన్నతస్థాయి సమీక్ష
- రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యలు





మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ, సమీక్షలో పాల్గొన్న ఎస్పీలు, వివిధ శాఖల అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో చేపట్టే పకడ్బందీ చర్యలపై శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సాలూర రోడ్డులోని ఎన్ఎస్ కన్వెన్షన్ హాలులో మహారాష్ట్ర పోలీసులతో పాటు, రాష్ట్రంలోని ఆరు జిల్లాల ఎస్పీల సమావేశం జరిగింది. సమావేశంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు పటిష్ఠ నిఘా పెట్టాలన్నారు. మద్యం, నగదు సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించాలన్నారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నాందేడ్ జిల్లా సరహద్దుల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చెక్ పోస్టులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేసుకొని నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ విషయంలో ఇరు జిల్లాల, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులైన సాలూర, కండ్గావ్, కందకుర్తి, పోతంగల్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు అంతర్ జిల్లా చెక్ పోస్టులు డోడ్గాన్ (సోన్) బ్రహ్మంగారి గుట్ట, సిరికొండ, ఇందల్వాయి టోల్‌ప్లాజా, మల్లారం గండి, యంచ (బాసర)ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతంలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, వారిని నియంత్రించడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. సరిహద్దులో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీస్ అధికారులు వాట్సప్‌గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహాయ సహకారాలు అందించుకుంటూ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్, నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్, జగిత్యాల జిల్లా ఎస్పీ భాస్కర్, కామారెడ్డి జిల్లా ఎస్పీ బి శ్రీనివాస్‌రెడ్డి, నాందేడ్ జిల్లా (బోకర్) అదనపు ఎస్పీ కేఏ ధరణి, నిజామాబాద్ జిల్లా అదనపు డిప్యూటీ కమిషనర్ జయరామ్, నిజామాబాద్ జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారి లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సీఐలు, రోడ్డు, ట్రాన్స్‌పోర్టు, ఫారెస్టు, రెవెన్యూ శాఖల అధికారులు, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పోలీసు అధికారులు సమీక్ష పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీల్లో ముగ్గురికి చోటు

- పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా మాజీ మంత్రి షబ్బీర్ అలీ
- ఏఐసీసీ కమ్యూనికేషన్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా మదన్‌మోహన్‌రావు
- చార్జ్‌షీట్ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే గంగారాం



షబ్బీర్ అలీ   మదన్‌మోహన్‌రావు   గంగారాం

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వివిధ కమిటీలను నియమించింది. ఆయా కమిటీలలో జిల్లాకు చెందిన ముగ్గురు నేతలకు స్థానం దక్కింది. ఎన్నికలకు సంబంధించిన పబ్లిసిటీ కమిటీ చైర్మన్‌గా మాజీ మంత్రి షబ్బీర్ అలీ ని నియమించారు. ఏఐసీసీ కమ్యూనికేషన్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు, చార్జ్‌షీట్ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాంలను నియమిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఏఐసీసీ నాయకత్వం పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తోంది. అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తులను స్క్రీనింగ్ కమిటీ పరిశీలించిన తర్వాత పోటీ లేని చోట ఒక్కరి అభ్యర్థిత్వాన్ని, పోటీ ఉన్న చోట ఇద్దరు, ముగ్గురి పేర్లతో జాబితాను రూపొందించి జాతీయ నాయకత్వానికి పంపించింది. పని విభజనలో భాగంగా రాష్ట్రంలో పలు కమిటీలను నియమిస్తోంది. శనివారం ప్రకటించిన పలు కమిటీలలో జిల్లాకు చెందిన ముగ్గురికి అవకాశం కల్పించింది.

క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్ల సమ్మె నోటీస్



భిక్కనూరు: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 11 నుంచి సమ్మె చేస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కార్యదర్శి యాదమ్మ అన్నారు. శనివారం భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



సదాశివనగర్: మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన రితిష్ ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. దీంతో గ్రామస్తులు శనివారం ఆ యువకుడిని సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి కోర్టులో లోక్‌అదాలత్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. 1025 కేసులను న్యాయమూర్తి హారిక పరిష్కరించినట్లు వారు తెలిపారు. పీపీ వీరన్న, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నామ శ్రీకాంత్, న్యాయవాదులు పండరి, సతీష్, నామ శ్రీనివాస్, సాయిప్రకాష్ దేశ్‌పాండే, నాగం సాయిబాబా, ఇమాన్యుయేల్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, ఎస్సై గణేష్ పాల్గొన్నారు.

పోషణ వారోత్సవాలు



నిజాంసాగర్: మండలంలోని అచ్చంపేట, బ్రాహ్మణపల్లి, వెల్గనూర్, మల్లూర్, జక్కాపూర్, ఒడ్డేపల్లి, నర్వ, శేర్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ ఆహార వారోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచులు అనుసూయ, బాలయ్య, రమేష్ గౌడ్, కాశీంసాబ్, సంధ్యారాణి, గోర్గంటి సంగమణి, లావణ్యశ్రీధర్‌రెడ్డి, వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు రోజా, నాగమణి, విజయలక్ష్మి, వినోద, సావిత్రి, సాయవ్వ, కమల ఉన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోతుల ప్రక్రియకు సంబంధించి డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం డీఈవో రాజుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మనోహర్ రావు, లక్ష్మిరాజం తదితరులున్నారు.

అలుగు పారుతున్న పాత చెరువు



నిజాంసాగర్: వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని నర్వ గ్రామ పాత చెరువు అలుగెల్లింది. దీంతో నర్వ, అన్నాసాగర్ గ్రామాల ఆయకట్టు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు. చెరువు కుడి, ఎడమ కాలువల కింద 365 ఎకరాల్లో వానాకాలం పంటలు సాగు చేస్తున్నారు. చాలా రోజుల తర్వాత చెరువు అలుగు పారుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అయినోళ్లకే ఇళ్ల స్థలాలిస్తారా..?

అర్హులను పట్టించుకోరా..?

- మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో ఇళ్ల స్థలాల పంపిణీలో అధికార పార్టీ నాయకుల ముద్ర
- రోడ్డెక్కిన బాధితులు



మోర్తాడ్ మండలంలోని పాలెంకు చెందిన శ్రీపాద సువర్ణకు ఇల్లు కానీ, ఖాళీ స్థలం లేదు. ఏళ్ల నుంచి ఆమె కుటుంబం అద్దె ఇంట్లోనే నివసిస్తోంది. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను అర్హులైన వారికి కేటాయించాలని నిర్ణయించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించిన అధికారులు పరిశీలన జరిపి మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా పట్టా సర్టిఫికెట్‌లను పంపిణీ చేయించారు. ఆ జాబితాలో శ్రీపాద సువర్ణ పేరు లేదు. ఇంటి స్థలం పొందడానికి అన్ని విధాలుగా అర్హత ఉన్నా ఆమెకు రాజకీయ నాయకుల దయ లేకపోవడంతో ఇంటి స్థలం దక్కలేదనే ప్రచారం జరుగుతోంది. ఇది ఒక్క సువర్ణకు ఎదురైన సమస్యే కాదు. మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో ఎంతోమంది అర్హులకు ఇళ్ల స్థలాలు దక్కకపోగా అర్హత లేనివారికి ప్లాట్లు కేటాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మోర్తాడ్(బాల్కొండ) : వడ్డించేవారు మన వారైతే ఏ మూల కూర్చున్నా విందు భోజనం పుష్టిగా తినొచ్చు అనే నానుడి మాదిరిగానే తయారైంది ఇళ్ల స్థలాల కేటాయింపుల వ్యవహారం. బీఆర్‌ఎస్ పాలనలో రాజకీయాలకు అతీతంగానే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయని మంత్రి ఇటీవల ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మాత్రం అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకున్నవారికే పథకాలు, ఇళ్ల స్థలాల అందుతున్నాయని స్పష్టమవుతోంది. పాలెంలో 95 మందికి, తిమ్మాపూర్‌లో 85, ఏర్గట్ల మండలం తడపాకల్‌లో 31, తాళ్లరాంపూర్‌లో 22 మందికి గతంలో సేకరించిన భూముల్లో ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఈ కేటాయింపులో అధికార పార్టీ ముద్ర స్పష్టంగా ఉందని ఆ పార్టీ నాయకుల కటాక్షం లేనివారికి ఇళ్ల స్థలాలు దక్కలేవని వెల్లడవుతోంది. పాలెంలో దాదాపు 50 మంది అర్హత లేనివారికి ప్లాట్లు లభించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తిమ్మాపూర్‌లో పది మంది వరకు, ఇతర చోట్ల కూడా కొంత మందికి ఇళ్ల స్థలాలు పొందే అర్హత లేకపోయినా నాయకుల ప్రోద్బలంతో అధికారులు పట్టా సర్టిఫికెట్‌లను జారీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. పాలెంలో జరిగిన అక్రమాలపై అనేక మంది అర్హులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆందోళన నిర్వహించారు. సోమవారం ఈ ప్లాట్ల కేటాయింపుపై పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

ఆస్తులున్నోళ్లకే ప్లాట్లు ఇచ్చారు..



పాలెంలో ఎంతోమంది పేదలున్నా బంగ్లాలు, ఇతర ఆస్తులు ఉన్నవారికే ఇళ్లస్థలాలు కేటాయించారు. మేం కూలి పని చేసుకుని పొట్టపోసుకుంటున్నాం. మాకు ఇంత జాగా ఇస్తే గుడిసె వేసుకుని ఉంటామనుకున్నాం. మాకు అన్యాయం చేశారు. – నర్సుబాయి, పాలెం

విచారణ చేయాలి..



ఇళ్ల స్థలాలను కేటాయించే విషయంలో అక్రమాలు జరిగాయి. విచారణ జరిపించి అనర్హులను తొలగించాలి. కనీసం గూడు లేనివారికి ఇళ్ల స్థలాలను కేటాయించలేదు.అధికారులు, మంత్రి దీనికి సమాధానం చెప్పాలి. ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఆందోళన చేస్తాం. – తాళ్ల అన్నపూర్ణ, పాలెం

రాష్ట్రస్థాయి వ్యాసరచనలో క్షత్రియ విద్యార్థి ప్రతిభ



గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న లౌకిక

ఆర్మూర్‌టౌన్: జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని లౌకిక ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయిలో 'అడ్రెస్సింగ్ ద ఎడ్యుకేషన్ రోల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రోల్' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో లౌకిక ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ లౌకికను ప్రశంసాపత్రంతో సత్కరించారు. తమ కళాశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడంతో యాజమాన్యం, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

సదరం స్లాట్ బుకింగ్ తిప్పలు

- వంద మందికిపైగా మీసేవ కేంద్రాలకు రాక
- నలుగురికి మాత్రమే బుక్కయిన స్లాట్లు
- నిరాశతో వెనుదిరిగిన దివ్యాంగులు



మీసేవ కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న దివ్యాంగులు

నాగిరెడ్డిపేట: సదరం స్లాట్ బుక్ చేసుకోవడానికి మండలంలోని పలుగ్రామాల నుంచి తరలివచ్చిన దివ్యాంగులకు నిరాశే ఎదురయ్యింది. స్లాట్ బుకింగ్ కోసం శనివారం ఉదయంనుంచే వందమందికి పైగా దివ్యాంగులు నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేటలో గల మీసేవ కేంద్రాలకు వచ్చారు. కానీ స్లాట్ బుకింగ్‌కు సంబంధించిన వైబ్‌సైట్ ఉదయం 11 గంటలకు ఓపెన్ అయ్యి 15 నిమిషాలే అందుబాటులో ఉంది. ఆ సమయంలో రెండు మీసేవ కేంద్రాలలో కలిసి నలుగుఇకి మాత్రమే స్లాట్‌లు బుక్ అయ్యాయి. వినికిడి లోపం, అంధత్వం ఉన్నవారికి మాత్రమే స్లాట్ బుక్ అయినట్లు తెలిసింది. దీంతో మిగిలినవారంతా చాలాసేపు నిరీక్షించి, నిరాశతో వెనుదిరిగారు.

‘గమ్యం’తో ప్రయాణం సులభతరం

- బస్సు కోసం వేచి చూడాల్సిన పని లేదు
- సరికొత్త ఫీచర్లతో మహిళా ప్రయాణికులకు పెద్దపీట
- అత్యవసర సేవలకు డయల్ 100, 108 అనుసంధానం



ఖలీల్‌వాడి: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి టీఎస్ ఆర్టీసీ 'గమ్యం' యాప్‌ను రూపొందించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఎప్పటికప్పుడు సరికొత్త రాయితీలు ప్రకటిస్తూ.. కొత్త కార్యక్రమాలను చేపడుతూ ప్రయాణికులకు చేరవవుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టిన ఈ యాప్‌లో తాము చేరాల్సిన బస్సు ఏ ప్రాంతంలో ఉందో, ఎప్పుడు గమ్యానికి చేరుతామో వంటి సమాచారాలు నిక్షిప్తమై ఉంటాయి. ఆగస్టు12న ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్రవ్యాప్తంగా ఈ బస్సు ట్రాకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ సహాయంతో తాము ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుందో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇది వరకు జీపీఎస్, టీఎస్‌ఆర్టీసీ పేరుతో యాప్ ఉన్నా ప్రస్తుతం సరికొత్త ఫీచర్లతో మహిళా ప్రయాణికులకు పెద్దపీట వేస్తూ ఆర్టీసీ కొత్త యాప్‌ను అందుబాటులో తీసుకొచ్చింది. దీంతో ఈ యాప్‌తో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇకపై నిరీక్షణకు తెర

యాప్‌రాక ముందు ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్‌లో వేచి ఉండాల్సి వచ్చేది. విచారణ కేంద్రంలో బస్సు ఎప్పుడు వస్తుందన్న సమాచారానికి సరైన సమాధానం దొరక్కపోయేది. బస్సు వస్తుందా.. ఎక్కడైన మరమ్మతులకు గురైందా అనే ప్రశ్నలకు సైతం సమాధానం ఉండేది కాదు. ఇకపై గమ్యం యాప్‌తో సమస్యలకు చెక్ పెట్టొచ్చు. ఈ యాప్‌లో ఎక్కాల్సిన బస్సు సమాచారం మొత్తం ఉంటుంది. చేరాల్సిన గమ్యానికి ఎన్ని గంటలు పడుతుంది, ఏ ప్రాంతంలో బస్సు ఉంది, బస్సు నంబర్, డ్రైవర్ ఫోన్ నంబర్ సమాచారం ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరుడిపోల్లోని పల్లెవెలుగు బస్సులకు మినహా ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ, రాజధాని, గరుడ వంటి వాహనాలకు యాప్ వివరాలను అనుసంధానం చేశారు.

మహిళా ప్రయాణికులకు పెద్దపీట..

మహిళలకు గమ్యం యాప్‌లో కొత్త ఫీచర్‌ను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చింది.రాత్రి వేళల్లో బస్సు స్టాప్ లేని ప్రాంతాల్లో ఈ యాప్‌లో ఫీచర్ అయిన ఫ్లాగ్ ఏ బస్‌లో సమాచారం నమోదు చేస్తే ఆ బస్సు ఆగేందుకు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రివేళలో మహిళలకు భద్రత ఈ యాప్ ద్వారా కల్పించారు. రాత్రి 7 నుంచి ఉదయం 6 గంటల వరకు అందుబాటులో ఉండే ఈ ఫీచర్‌లో మహిళా ప్రయాణికులు వివరాలు నమోదు చేస్తే ఆకుపచ్చ లైట్ వస్తుంది.ఈ లైట్‌ను బస్సు డ్రైవర్‌కు చూపిస్తే బస్సును తక్షణమే ఆపుతారు. దీంతో సురక్షితంగా గమ్యస్థానానికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది.

పోలీసులకు సమాచారం..

ఈ గమ్యం యాప్‌తో అత్యవసర పరిస్థితిలో బటన్ ద్వారా కాల్ సెంటర్‌ను సంప్రదించే అవకాశం ఉంది. డయల్ 100, 108కి ఈ యాప్‌ను అనుసంధానం చేశారు. దీంతో నేరుగా పోలీసులకు సమాచారం అందుతుంది. ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే 108కు సమాచారం వెళ్తుంది. రోడ్డు ప్రమాదం, బ్రేక్ డౌన్, అత్యవసర పరిస్థితిలో వైద్యసాయానికి ఈ యాప్ ద్వారా నివేదించవచ్చు. గూగుల్‌ప్లే స్టోర్, ఆపిల్ స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందులో తెలుగు, ఇంగ్లీష్‌లో వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంది.

గమ్యం యాప్‌తో ఎంతో మేలు



ప్రయాణికులు గమ్యం యాప్ ను ఉపయోగించుకోవాలి. ఈ యాప్‌లో బస్సు ఎక్కడ ఉంది, కండక్టర్, డ్రైవర్ వివరాలు అందుబాటులో ఉంటాయి. మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ పెద్దపేటవేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. మహిళలకు రాత్రి 7 నుంచి ఉదయం 6 గంటల వరకు ఫ్లాగ్ ఏ బస్ ద్వారా ఎక్కడైనా బస్సు ఎక్కడానికి అవకాశం ఉంది. ప్రయాణికులకు సమయభావనకు తోడ్పడుతుంది.

– జానీరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నిజామాబాద్

డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాల ఏర్పాటు



నిజామాబాద్ తపాలా శాఖ

నిజామాబాద్ సిటీ: విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసేందుకు భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో డాక్ నిర్యత్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు శనివారం నిజామాబాద్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్. అనిల్‌కుమార్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్, కామారెడ్డి పట్టణాల ప్రజలు తక్కువ ఖర్చుతో డాక్ నిర్యత్ కేంద్రాల ద్వారా విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసే సంస్థల ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇంపోర్ట్ ఎక్స్‌పోర్టు లైసెన్స్ ఐఈసీ కోడ్ కలిగిన సంస్థలు ఈ డాక్ నిర్యత్ కేంద్రాల ద్వారా సులభంగా అతి తక్కువ ధరలో తమ వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఫ్రీ హోం పికప్‌తో పాటు అతి తక్కువ ధరలో పార్సెల్ ప్యాకింగ్ యూనిట్‌తో ఎగుమతి వస్తువులను ప్యాక్ చేయడ జరుగుతుందన్నారు. భారత తపాలా శాఖ జాయింట్ పార్సెల్ ప్రొడక్ట్ పేరుతో రైల్వే బోర్డు ద్వారా వీటిని డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలని సూచించారు.

అధ్వానంగా రోడ్లు



గుంతలమయంగా మారిన ఘన్‌పూర్ - సింగరాయపల్లి రోడ్డు



సలాబత్‌పూర్ ఆలయానికి వెళ్లే దారిలో బురద

రామారెడ్డి: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు రోడ్లు దెబ్బతిన్నాయి. రామారెడ్డి నుంచి రెడ్డిపేటకు వెళ్లే మార్గంలో వర్షానికి బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడగా, రెడ్డిపేట నుంచి సింగరాయపల్లికి వెళ్లే మార్గంలో గుంతలు పడ్డాయి. ఘన్‌పూర్ దగ్గరలో బీటీ రోడ్డు కొట్టుకు పోయింది. రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బురదతో భక్తులకు ఇబ్బందులు

మద్నూర్(జుక్కల్): శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయ పరిసర ప్రాంతం, ఆలయంలోకి వెళ్లే మార్గం బురదమయంగా మారింది.

క్రైం కార్నర్

పాల వ్యాన్, స్కూటీ ఢీ : ఒకరు మృతి



లావణ్య మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్ ప్రాంతంలో పాల వ్యాన్, స్కూటీ ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్పల్లి మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన కిషన్ అతని భార్య లావణ్య(42)తో కలిసి స్కూటీపై ఆర్యనగర్‌లోని బంధువుల ఫంక్షన్‌కు వచ్చారు. తిరుగు ప్రయాణంలో వీరిని పాలవ్యాన్ ఢీకొన్నది. ఈ ఘటనలో కిషన్‌కు తీవ్రగాయాలు కాగా లావణ్య మృతి చెందినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని షోలపూర్ జిల్లా సర్వాడేనగర్‌కు చెందిన డ్రైవర్ సైఫన్ భగవాన్‌గా గుర్తించినట్లు ఎస్సై చెప్పారు. మృతురాలి సోదరుడు కర్రి వెంకటచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పరిస్థితి విషమించడంతో విద్యార్థి..



మహ్మద్ ఆమేర్‌ఖాన్ (ఫైల్)

కమ్మర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ విద్యార్థి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఆమేర్‌ఖాన్ (25) బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ నెల 5న పరీక్షల నిమిత్తం హాల్ టికెట్ తీసుకునేందుకు హైదరాబాద్ వెళ్లిన ఆమేర్‌ఖాన్‌ను బండ్లగూడ ట్రాఫిక్ సిగ్నల్‌వద్ద గూడ్స్ వ్యాన్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బండ్లగూడ పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

చెట్టుపై నుంచి పడి ఒకరు..



మృతుడు సాయిలు

కోటగిరి (రుద్రూర్): కోటగిరి శివారులో చెట్టుపై నుంచి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తంబ్లూర్ సాయిలు (40)తో పాటు మరో ముగ్గురు ఎలక్కాయలు తీసుకొచ్చేందుకు వెళ్లారు. చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు సాయిలు జారి పడడంతో తీవ్ర గాయలై మృతి చెందాడు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

సిర్నాపల్లిలో ఒకరిపై కేసు నమోదు

ఇందల్వాయి: సిర్నాపల్లి సర్పంచ్ విజయ్ ఇంటిపై అదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజుకి మరో వ్యక్తికి గొడవ జరగడంతో సర్పంచ్ సర్దిచెప్పి గొడవను సద్దుమనిగించాడు.

అందులో సర్పంచ్ తనకు అన్యాయం చేశాడని ఆరోపిస్తూ మద్యం సేవించి సర్పంచ్ ఇంటికి చేరుకొని ఇంట్లో ఉన్న పిల్లలను చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కలవారు రాజుని అదుపు చేసి పోలీసులకి సమాచారం అందించారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

భిక్కనూరు: మండల సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. రాజంపేట మండలం పొందుర్తి గ్రామానికి చెందిన వడ్ల విరాట్- కమ్మరి ఐశ్వర్య ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి పొందుర్తి గ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో విరాట్, ఐశ్వర్యలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సర్వ సమాజ్ గణేశ్ మండలి వద్ద పేయింటింగ్ వేస్తున్న సురేశ్(39) విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో కూలిన ఇల్లు

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఇందిరానగర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీకి చెందిన మర్లు సంగవ్వ ఇల్లు కూలిపోయిందని కాలనీవాసులు శనివారం తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

స్నేహం కుదిరింది




మాచారెడ్డి: కుక్క, కోతి జాతి వైరం మరిచి స్నేహంగా మెలుగుతూ కుల, మత భేదాల కారణంగా కొట్టుకు చస్తున్న మనుషులకు స్ఫూర్తిగా నిలిచాయి. జాతి వైరాలు తమకు లేవంటూ సఖ్యతగా మెలుగుతున్న ఈ రెండు మూగజీవాలు మండలంలోని గజ్యానాయక్‌తండా చైరస్తాలో శనివారం సాక్షి కెమెరాకు దొరికాయి.

గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గల్ఫ్ వలస కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని వినతి

మోర్తాడ్(బాల్కొండ): పసుపు రైతుల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో వలస కార్మికులు గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు పట్టుబడుతున్నారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు వారి కుటుంబాలకు ప్రత్యేక పథకాలు అందించడానికి గల్ఫ్ బోర్డు ఏర్పాటు ఒక్కటే మార్గమనే అభిప్రాయాన్ని వలస కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. గల్ఫ్ వలసలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో కార్మికుల కోసం ఇప్పటి వరకు ప్రత్యేక కార్యాచరణ ఏది లేకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో వలస కార్మికులకు అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నాయి. ఎన్‌ఆర్‌ఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి వలస కార్మికులకు ఎన్నో రకాల సంక్షేమ, పునరావాసం, పునరేకీకరణ అమలు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 15లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ప్రతి నెలా రూ. కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని వలస కార్మికులు మన దేశానికి చేరుస్తున్నారు. విదేశాలకు వలస వెళ్లిన వారిలో ఎక్కువ ఆదాయం సమకూరుస్తుంది గల్ఫ్ వలస కార్మికులే కావడం విశేషం. కరోనా విపత్కర పరిస్థితుల నుంచి బయటపడిన తరువాత వలసలు పెరగడం గమనార్హం. స్థానికంగా ఉపాధి లేకపోవడం గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతం కావడంతో వలసదారుల సంఖ్య గతంలో కంటే ఎక్కువ పెరిగింది. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తే వలస వెళ్లే కార్మికులకు ఎంపిక చేసుకున్న రంగాల్లో శిక్షణ ఇచ్చి సక్రమ మార్గంలో వీసాల జారీ వలస వెళ్లడానికి ఆటంకాలు లేకుండా చేయడం జరుగుతుంది. వలస కార్మికులు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా ఉండటానికి నిఘా పటిష్టం చేయడానికి అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుని గల్ఫ్ బోర్డు ఏర్పాటుపై దృష్టి సారించాలని వలస కార్మికుల సంఘాలు కోరుతున్నాయి.


కార్మికులను పట్టించుకోవాలి



వలస కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోవాలి. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకపోతే అర్థం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు సమన్వయం చేసుకుని వలస కార్మికుల కోసం కార్యాచరణ చేపట్టాలి. ఉపాధి నిమిత్తం వలస వెళ్లే కార్మికులపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– తోట రమేశ్, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ కో ఆర్డినేటర్(బహ్రెయిన్)


వలస కార్మికులతో దేశానికి ఆదాయం



వలస కార్మికులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి సొంతంగా సంపాదించడంతో పాటు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి దేశానికి ఎంతో లాభాన్ని చేకూరుస్తున్నారు. వలసలతో వివిధ రంగాల వారికి ఉపాధి లభిస్తుంది. వలస కార్మికులతో దేశానికి ఆదాయం ఉన్నా కార్మికులకు మాత్రం ఎలాంటి లాభం లేదు.

– శివనోల్ల రాజు, కువైట్ రిటర్న్(ఏర్గట్ల)

అలరించిన ఇంద్రధనస్సు



సిరికొండ: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఇంద్రధనుస్సు అలరించింది. దట్టమైన మేఘాలు ఏర్పడి వాటిలో ఘనీభవించిన నీటి బిందువులపై సూర్యకిరణాలు పడినప్పుడు ఇలాంటి దృశ్యం ఆవిష్కృతమవుతుంది. మంచు బిందువులపై పడిన కిరణాలు పరావర్తనం చెంది ఇలా ఇంద్రధనస్సు రంగుల్లో కనిపిస్తాయని నిపుణులు పేర్కొన్నారు.